# పరివేష్టిత

కథకుడు:

రైలు దిగేసరికి చీకటి పడింది. వర్షం పడుతున్నది. అదృష్టవశాత్తు దొరికింది ఎడ్లబండి. బండివాడు సంతోషంగా వస్తాననడంతో సగం బెంగ తీరిపోయింది రాజేశ్వర రావుకు. సాయంత్రం - జ్వర లక్షణాలు మొదలయ్యాయి. రైలు దిగేసరికి మరింత ఇబ్బంది పడసాగాడు. జ్వరం ఎక్కువయింది. ఒళ్లంతా నొప్పులు. కూచోలేకపోతున్నాడు. ఎడ్లబండిలో ఊరు దాదాపు గంట ప్రయాణం.

ఆకాశం నిండా వర్షపుమేఘాలు. మిరుమిట్లు గొలిపే మెరుపులు. ఉరుములు. అంతలోనే కండ్లు పొడిచినా కన్పించనంతటి చీకటి. అదే జీవితంలో, మానవ ప్రకృతిలో కూడా సమన్వయిస్తుంది. ఆ కల్లోలాలు తర్వాత వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది.

ఈ జడివానలో కాంతమ్మ, రాజేశ్వరరావు బావ రాక కోసం ఎదురు చూస్తున్నది. బావ రైలు దిగి ఎడ్లబండిలో ఈపాటికి వస్తూ ఉంటాడు. బావ.... తనకోసం వస్తాడు.

ఈదురుగాలి. జిణజిణ చినుకులు. కుండపోతగా వర్షం. చీకటి, ప్రకృతి కళ్లు కప్పి రాజ్యమేలుతున్నది. రాత్రి పిట్టలు వర్షానికి తట్టుకోలేక బాధతో, అరుస్తున్నట్టున్నాయి. పిడుగులు పడుతున్నట్టు ఉరుములు. అగ్నిగోళాలు బద్దలవుతున్నట్టు మెరుపులు.

జ్వరంతో ఒళ్లు కాలిపోతున్నది. ఈ జ్వరంతో తను బతకగలడా? మేనమామగారి ఇంటి వరకు తను ప్రయాణం చేయగలడా? మధ్యలోనే ప్రాణం పోయి ఈ మృతదేహమే అక్కడకు చేరుతుందా? భయపడుతున్నాడు రాజేశ్వరరావు.

ముత్యాలమ్మ గాఢమైన నిద్రలో ఉంది. ఆమెకు ఆ నిద్రే శాంతి. జీవితంలో ప్రశాంతి ఒక్క నిద్రలోనే. కొడుకు చిన్నకులం అమ్మాయిని లేవదీసుకుని దేశంకాని దేశానికి పారిపోయాడన్న దుఃఖం. కూతురు కాంతమ్మని అల్లుడు కాపరానికి తీసుకుపోవడం లేదని దుఃఖం, తాగుతూ, తూలుతూ, పేలుతూ, రోగాలతో భర్త ప్రవర్తనతో దుఃఖం. ఈ దుఃఖాలలో ఆ నిద్రే ఆమెకు శాంతి.

కాంతమ్మ:

ఇవేళ, ఈ రాత్రి బావ వస్తాడు. సుమారు సంవత్సరంగా ఎదురు చూస్తున్న మహా

సౌందర్య జలం ఇనాటికి తన మాన్యం చేరుతుంది. గలగలా జలజలా పొలమంతా ప్రవహిస్తుంది. తను పొలమై పూల తోటఐతే, బావ జలమై వచ్చి పంటని కాపాడుతాడు. ఈ ఇంటికి క్షణక్షణానికి దగ్గరవుతున్నాడు. గడప తొక్కిన బూట్ల చప్పుడు, బండివాడు అరుగుమీద తెచ్చి పెట్టే ట్రంక్ పెట్టె చప్పుడు, బావ బండి వాడికి పైసలు ఇవ్వడం, బండి వెళ్ళిపోయే చప్పుడు అన్నీ తెలుస్తాయి.

నేనిప్పుడు ఇక్కడ కన్నవారింట్లో గత ఏడాదిగా ఉంటున్నట్టు బావకి తెలుసునా లేక నేను ఇంకా అత్తవారింట్లోనే ఉన్నాననుకుంటున్నాడా?

ఈ ఆలోచనలకేం కాని బావ వస్తూ ఉంటాడు. రాడా? ఇవేళ రైలు ఆలస్యంగా వస్తుందా? ఈ వానకి జడిసి స్టేషన్లోనే ఉండిపోతాడా? ప్రయాణం వాయిదా వేసుకున్నాడా? బావ ఒకసారి దగ్గరకు తీసుకోబోతే విదిలించుకుని వచ్చేశాను. గుర్తుంచుకున్నాడేమో. ఓసారి వెనకనుండి చప్పుడు చేయకుండా వచ్చి కావలించుకోబోతే వెనక్కి తోసేసి గుడ్లురిమిచూశాను. మరచిపోలేదేమో. ఓ మధ్యాహ్నం మంచం మీద మగతనిద్రలో ఉంటే వచ్చి పెదాల మీద ముద్దు పెట్టుకున్నప్పుడు చెంప ఛెళ్లుమనిపించాను. బాధపడ్డాడేమో. అవన్నీ ప్రేమచేష్టలని నాకప్పుడు తెలీదు. ఆ చిలిపి చేష్టలు బావ.... చిరునవ్వుల బావ వస్తున్నాడు. ఈ రాత్రి.

ఆ రోజులూ, ఆ కోరికలూ, ఆ ఆటపాటలూ, అలకలూ, కోపతాపాలు వేరు. అప్పుడు తెలీదు బావకి నాపట్ల ఎంత ప్రేమో.... తన భార్య కాబోతున్నది అన్న నమ్మకం బావకి. అప్పట్లో బావ అంటే ఎందుకో నాకు తెలీదు. దగ్గరకు రానిచ్చేదాన్నే కాదు. ఇష్టం ఉండేది కాదు. ఆ పెత్తనం భరించలేకపోయేదాన్ని.

ఇప్పుడు నాకు బావ కావాలి. నా బావ కదా.

బావ కోసమనే పెళ్లి చేయకుండా నన్ను ఉంచారు. బావ ఇంకో మూడు సంవత్సరాలు పెళ్లి చేసుకోనని నిశ్చయంగా చెప్పేశాడు. తన చదువు పూర్తికావాలన్నాడు. ఉద్యోగంలో చేరందే పెళ్లి చేసుకోనన్నాడు. అమ్మా నాన్నలు లేని బావని తాత చదివించాడు. చదువు తప్ప ఇంకో దృష్టి లేదని, ఎందరు ఒప్పించాలని ప్రయత్నించినా పెళ్లికి ఒప్పుకోలేదు. మా ఇంట్లో పెళ్లి తొందర. పెద్దలు పెద్దలు మాటాడుకుని ఓ అబ్బాయితో సంబంధం నిశ్చయం చేశారు. కాబోయే పెళ్లి కొడుకు బావకన్నా అయిదారేళ్లు పెద్ద వయసువాడు. అప్పటికే తాలూకాఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

బాగా ఆస్థిపాస్తులు ఉన్నవాడు. అన్నిటికన్నా ముఖ్యం తొలిచూపులోనే నాకు నచ్చాడు. ఇష్టమేనా అని అమ్మ అడిగితే సరే అని తలూపాను. పెళ్లయిపోయింది. అత్తవారింట్లో అడుగుపెట్టాను. అప్పుడర్థమయింది. నాకా ఇంట్లో కోడలన్న ప్రేమాభిమానాలు లేవని.

అత్తామామలు - పట్టించుకునేవాళ్లు కాదు. ఆయన మాత్రం దగ్గరకు రానిచ్చేవాడు కాదు. అప్పటికే ఆయనకు ఒక ప్రియురాలు ఊళ్లో ఉందని తెలిసింది. ఆయన కన్నా వయసులో నాలుగేళ్లు పెద్దది. బాల వితంతువు. ఆమెకి చాలా ఆస్థులున్నాయి. బంగారం ఉంది. దాన్నెవరూ తప్పుపట్టలేదు. కన్నీళ్లు మున్నీళ్లతో గడిపాను. అమ్మ నాన్నలతో చెప్పుకున్నాను. అన్నీ సర్దుకుంటాయి. ఓపిక పట్టు అంటారే తప్ప నాకష్టం అర్థం చేసుకోరు. ఆ పెరట్లోని బావిలో పడి చచ్చిపోవాలనుకున్నాను. అంతలోనే బావ గుర్తు వచ్చాడు.... నా కష్టాలు బావకు చెప్పుకోవాలనుకున్నాను. నాకు చోటు లేని ఆ ఇంట్లో నిలవలేకపోయాను. ఆ అవమానాల బతుకు అక్కర్లేదనుకున్నాను.

మెరుపులు మెరుస్తున్నాయి. ఆ ఉరుముల్లో వర్షంలో బావ వస్తాడు.

రాజేశ్వరరావు:

ఇంటికి రావటం కన్న ఆస్పత్రిలో చేరిపోయి ఉంటే ఈ అనారోగ్యం భయం ఉండేది కాదు. ఇది మామూలు జ్వరమో లేక ఇంకేమన్నా ప్రమాదకరమైందో.... డబ్బులేకపోయింది. ప్రయాణం మానుకోవాలనే అనుకున్నాను. కాని ఇక్కడ నాకు ఈ పరిస్థితిలో తోడు ఎవరుంటారు? ఎవరు చేస్తారు? మేనత్త. స్వయానా మానాన్న చెల్లెలు. అత్తమ్మకి నేనంటే ప్రేమ. ముద్దు. తల్లీ తండ్రీ లేని వాడినని జాలి.

అత్తమ్మ అయితే అనురాగం చూపిస్తుంది. కాని మావయ్య. వాడు కోపిష్టి. నన్ను సహిస్తాడా? ఈ అర్థరాత్రి వచ్చినందుకు ఎన్నికేకలు వేస్తాడో? ఈ వానలో, చలిలో, చీకట్లో బండివాడు తన కూలి కోసం వస్తున్నాడే తప్ప.

'ఈ దినమంతా బేరం లేదు బాబు' ఈ బేరం దొరికినందుకు సంతోషంగా.

బండివానికోసం అతడి కుటుంబం ఎదురుచూస్తుంటుంది కాబోలు. పస్తులు పడుతున్నాడో ఏమో. నూకలు మూటతో ఇంటికి వస్తాడని గంజి కాచుకుని తాగుదామని ఆశిస్తూ ఉంటుంది అతడి భార్య. పిల్లలకు ఏమన్నా తింటానికి ఉందో లేదో. పాపం వాడికన్నా బక్క చిక్కి ఉందా ఎద్దు. ఆ కుటుంబాన్ని పోషించే ఆ జీవి. అతనికన్నా ఆశతో ఉంది బరువు మోసేందుకు. బండిలాగేందుకు. బరువు, వర్షం, చలి, బండివాని కేకలు, మెరుపులు, ఉరుములు బురదబురదగా బండి బాటలో ఆ బక్కఎద్దు బండిని లాక్కుపోతున్నది.

నేను తనకు ముఖం చూపడమే ఇష్టంలేని మావయ్య ఈ రాత్రి రాకకు ఎంత విసుక్కుంటాడో. ఇన్ని బాధలతో వస్తున్నానని అత్తయ్య అనుకోదు. అన్నీ నా కాంతమ్మే అని ఆశించిన ఆమె దగ్గరకు రానీయలేదు. ఇప్పుడామె పరాయిది. పగపట్టింది. లేకుంటే

- 'నీవేనా సర్వస్వం. నీవు లేకుంటే నాకేముంటుంది చెప్పు? ఇంకో మూడు సంవత్సరాలు పెళ్లి వద్దు మనకి. ఇప్పుడు నీకు నిండా పదిహేను సంవత్సరాలు కూడా లేవు. నా చదువు పూర్తి కావాలి. ఉద్యోగంలో చేరితే తప్ప పెళ్లిచేసుకోను. నా అభిప్రాయం అర్థంచేసుకో. నా ఇష్టం అని నువ్వు పట్టుపడితే నేనేం అడ్డం ఉండను. నీవు సుఖంగా ఉండాలని, సంతోషంగా ఉండాలని ఆశీర్వదిస్తాను.' ఆనాడు ఎంత నచ్చ జెప్పినా కాంతమ్మ నా మాట విన్లేదు సరికదా నిర్లక్ష్యంగా వెళ్లిపోయింది. ఇప్పుడు కాంతమ్మ అత్తవారింట్లో. భర్తతో..... ఈ సరికి తల్లి కూడా అయిందో ఏమో....

కథకుడు:

రాజేశ్వరరావు బండిలో కూర్చోలేడు. పడుకోలేడు. జ్వరానికి ఒళ్లంతా నొప్పులు మొదలయినాయి. కళ్లు మండుతున్నాయి. దాహం. బండి ఇల్లు ఎప్పుడు చేరుతుందో.....

ఎద్దు తనపని చేసేసినట్టుగా ఇంటిముందు ఆగింది. మూలుగుతూ బండివాడి సహాయంతో బండినుండి దిగి గడపలోకి నీరసంగా వెళ్లగలిగాడు. ఆ గడపలో నుంచోలేక కూలబడిపోయాడు. అత్తమ్మా అని మాత్రం ఒక కేక వేశాడు. ఆ కేక కూడా లోపలికి వినిపించేట్టు లేదు. బండివాడు ట్రంకుపెట్టె తీసుకొచ్చి అరుగుమీద పెట్టాడు.

రాజేశ్వరరావు.... బండివాడికి పైసలు ఇచ్చేసి.....'ఆ దేవుడే పంపించాడు నిన్ను' అని తనకి చేసిన ఉపకారానికి సంతోషం ప్రకటించుకున్నాడు. అంతలోనే మరికొంచెం పైసలు అదనంగా ఇవ్వడం న్యాయం అన్పించి జేబులోంచి తీసి లెక్క కూడా పెట్టకుండా వాడి చేతిలో పెట్టాడు. 'పాపం నాకోసం ఇంత వర్షంలో వచ్చావు.' అన్నాడు. బండివాడు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

వర్షం తగ్గింది. పూర్తిగా తగ్గిపోయింది.

కాంతమ్మకు అంతా తెలుస్తున్నది. బావలోపలికి వచ్చి తనని లాలిస్తాడని ఊహించుకున్నందువలన తన మంచం మీది నుండి లేవలేదు. ఇప్పుడు బావ ఆరోగ్యంగా ఉన్నట్టులేడని అర్థకావడంతో లేచి బైటికి వచ్చింది. చీకటి. ఇంట్లో దీపంలేదు. లాంతరు ఆరిపోయి చాలాసేపే అయింది. చీకట్లోనే బావ గడపలో కుప్పకూలిపోయి ఉన్నాడు. మూలుగుతున్నాడు. లాంతరు వెలిగించి ఆ వెలుగులో బావని చూసింది. చటపటాయిస్తూ కొట్టుకుంటున్నాడు. బాధతో నలిగిపోతున్నాడు. పువ్వులా వస్తాడనుకున్నబావ.

'బావా'

కొండలోయల్లోంచి మూలిగినట్టు పలికాడు బావ. కంపించిపోయింది కాంతమ్మ.

'బావా' దగ్గరకు వొంగి భుజం పట్టుకుని లేపి కూర్చోబెట్టాలని ప్రయత్నించింది.

శరీరం కాలిపోతున్నది. ఏమీ తోచలేదు. కూర్చోలేకపోతున్నాడు. మళ్లీ నేలమీదికి ఒరిగిపోయాడు.

తల్లి దగ్గరికు పోయి తల్లిని నిద్రలేపింది. లేపగానే ముత్యాలమ్మ నిద్ర లేచి కూర్చుంది. కాని నిద్రమత్తులోనే ఉంది. నెమ్మదిగా ఇంకా నిద్రపోతున్న శరీరాన్ని కూడదీసుకుని ఆవలింతలు తీస్తూ కూతుర్ని చూసింది.

'బావ వొచ్చాడమ్మా. గడపలో పడిపోయి ఉన్నాడు. ఒంట్లో బావున్నట్టు లేదు. జ్వరం ఒళ్లు కాలిపోతున్నాది. మూలుగుతున్నాడు.'

వర్షం ఆగిపోయినా వీధిలో వర్షం నీళ్లు ప్రవహిస్తూనే ఉన్నాయి.

మేనల్లుడిని లాంతరు వెలుతురులో పరిశీలనగా చూసింది.

కాంతమ్మ కూడా స్పష్టంగా చూడటం అదే. ఎంతో ఉత్సాహంగా నవ్వు ముఖంతో వస్తాడనుకున్న బావ.... ఈ బావనేనా.... తను

'నాయినా రాజా, లే..... లోపలికి పద.....' ముత్యాలమ్మ మాతృహృదయం ప్రేమతో కరిగిపోయింది. అత్తమ్మ చేతి స్పర్శ సంజీవినిలా - అతడి గొంతు పెగిలింది. తనలోని శక్తినంతటినీ కూడదీసుకుని 'అత్తమ్మా' అని ఆమె చేయి బలంగా పట్టుకున్నాడు. 'బావా' అని తాను పిలిచినప్పుడు పలకని బావ.

తల్లీ కూతుళ్లు ఇద్దరు రాజేశ్వర్రావుని లోపలికి తీసుకుపోయి మంచం మీదికి చేరవేశారు. ఆ శరీరాన్ని మోసుకుపోయినంత అయింది వాళ్లకి. ఏంచెయ్యాలో తట్టలేదు. రాగానే కాళ్లు చేతులూ కడుక్కుని భోంచేస్తాడని తయారు చేసి పెట్టింది. కాని ఇప్పుడు ఆ వంటలు పనికిరావు. మందులు కావాలి. ఇట్లాంటి జ్వరాలకు వాళ్లకు తెలిసిన మందు కషాయం కాచి ఇవ్వడం. మిరియాలు, శొంఠి, ధనియాలు, దానిమ్మచిగురు, ఇంకా ఏమేమో వేసి దాదాపు అర్ధగంటసేపు కాచి - చల్లార్చి ఆ కషాయం తాగించాలి. తెల్లవారితే పెద్దతాతని అడిగితే మందిస్తాడు. ఆకుల వేళ్ల ఔషధం. ఎంతటి జ్వరమైనా తప్పక ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుంది.

లాంతరు వెలుతుర్లో బావ దగ్గరే కూర్చుని జ్వరంతో కాలిపోతున్న ఆ శరీరాన్ని తాకింది. కనురెప్పల్ని కూడా లేపలేక పోతున్నాడు బావ. శరీరం మీద స్మారకం లేని స్థితి.

బైటకు వెళ్లి చూసింది ముత్యాలమ్మ. ఇంకా భర్త రాలేదు.

కాంతమ్మ బావ ప్రక్కనే కూర్చుని, జ్వరం తగ్గిందా లేదా అని పదే పదే చూస్తూ గడిపింది. ముత్యాలమ్మ మళ్లీ నిద్రలో మునిగిపోయింది. కాంతమ్మకి నిద్ర లేదు. తృప్తిగా ఉంది. బావసేవ చేస్తున్న సంతోషం. దాదాపు రెండు గంటల తర్వాత బావ ముఖంలో

చెమట బిందువులు కన్పించాయి. ఒళ్లంతా చెమట పట్టింది.

వేకువజాము. ఎక్కడో తొలికోడి కూసింది. విచ్చుకుంటున్న వెలుగులు. నిర్మలంగా ప్రకృతి. రాత్రి వానలో స్నానం చేసిన చెట్లు గలగల నవ్వుతున్నాయి.

రాజేశ్వరరావు కళ్లకు బలం చిక్కింది. ఇంట్లో మనుషులు కనిపించడంలేదు. అంతవరకు సేవచేసిన కాంతమ్మ ఇప్పుడు నిద్రపోతున్నది.

ముత్యాలమ్మ..... వచ్చి ఒకసారి మేనల్లుడిని చూసి వెళ్లింది. కషాయంతో జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. 'రాజు నిద్రపో' అని చెప్పి దూడని విడవడానికి పెరట్లో పశువులసాలకు వెళ్లింది. పాలు పిండుకుని రావాలి. ఆడపని మగపని అన్నీ ఆమెనే చెయ్యవలసి వస్తున్నది.

పాలముంతతో తిరిగి వచ్చేసరికల్లా వీధిలో రాగాలు తీస్తున్న భర్త. పడుతూ లేస్తూ, జోగుతూ వస్తున్నాడు. చేయెత్తు మనిషి. గడప ముందుకు వచ్చి వాకిట పడిపోయాడు.

ముత్యాలమ్మ పరుగు పరుగున వచ్చి భర్తని కూర్చోబెట్టింది. అంతలో కాంతమ్మ కూడా వచ్చింది. ఇద్దరూ ఆయన్ని మోసుకుంటూ పోయి అయినింట్లో ఓ మూల బొంత మీద పడుకోబెట్టారు. భర్త శరీరం మీది గాయాలువెతికి, తడిబట్టతో ఒళ్లంతా తుడిచింది. సారాయి విరుగుడు మందు తాగించింది. దుప్పటి కప్పింది. అంతలోనే అతడు నిద్రపోసాగాడు.

అన్ని కష్టాల్లోనూ తన ఆశ తన భర్తే. తనను ఎంతగానో ప్రేమించిన భర్త. తన ప్రసవ సమయంలో తన ఆయురారోగ్యాల కోసం మందులు తెచ్చి, పళ్లు, పిండి వంటలూ తెచ్చినవాడు. కంటికి రెప్పలాగ చూసుకున్నవాడు. తన దేవుడు.

అంతలో 'అత్తమ్మా' అన్నపిలుపు.

వంటగదిలో పొయ్యి దగ్గర పని చేసుకుంటున్న ముత్యాలమ్మ ఆ పిలుపుతో సంబరపడిపోతూ 'నాయినా రాజు' అంటూ పరుగెత్తుకు వచ్చింది.

కాంతమ్మ:

బావతో నా కష్ట సుఖాలు చెప్పుకోవాలని ఒకటే ఆలోచన. బావ ఇంకా కోలుకోవాలి. బాగా నీరసంగా ఉన్నాడు. దానికి తోడు తన దుఃఖాన్ని తనే మింగుకున్నట్లు కనబడుతున్నాడు. ఎట్లా ఉంది ఒంట్లో, తగ్గిందా బావా అని అడిగితే. తలూపుతాడే తప్ప నోటమాట రాదు. మళ్లీ అమ్మతో మాట్లాడుతాడు. అమ్మ టీ ఇస్తేనో, ఫలహారం పెట్టేనో, అన్నం పెట్టేనో మంచిగా తింటాడు. సామాన్యంగా ఆ పనులన్నీ అమ్మనే చేస్తుంది. ఎప్పుడన్నా నేను ఏదన్నా తీసుకుని వెళ్లి ఇస్తే అది అట్లానే ఉంటుంది. ఓ సారి టీ తాగనేలేదు. ఏంటి బావా ఈ టీ చల్లారిపోయింది కదా అంటే,

మరచిపోయానంటాడు. మరచిపోయి కాదు నా మీద కోపం. నాకు అర్థమవుతూనే ఉంది. బావని కాదని నేను పెళ్లిచేసుకున్నానని మనసులో పెట్టుకున్నాడు. నేనేంచేయను, ఇప్పుడు బావకు అంతా తెలుసు. అత్తవారు ఇంట్లో పెట్టిన కష్టాలనీ, పడ్డ అవమానాలనీ భరించలేక నాన్నని పిలిపించుకుని నాన్నతో కన్నవారింటికి వచ్చేసిన సంగతి తెలుసు. నామీద ప్రేమ లేకపోయినా జాలితో నయినా నా ఇబ్బందులు ఏమిటో తెలుసుకోవచ్చు. అదేం లేదు.

నాన్నకి బావ అంటే ఒకప్పుడు కోపం. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఒకటి రెండుసార్లు పొడిపొడి పలకరింపు మాటలు మాటాడి ఊరుకున్నాడు. బావ ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు కదా. సంపాదన పరుడయ్యాడు కదా. పైగా నాన్న ఇప్పుడు కల్లు సారాలకు బానిస అయ్యాడు. సాయంత్రం బైటపడితే - ఇప్పుడు బావ వచ్చిన ఈ వారం రోజులు నాన్న ఇంటికి రాత్రి పది గంటల లోపే వచ్చి అన్నంతిని తన మానాన తను మౌనంగా ఉంటున్నాడు. అరుపులు తగ్గాయి.

బావా, నీవు ఎల్లప్పుడూ గుర్తొస్తావు. నిన్ను చూడాలని ఎన్నాళ్లనుండో అనుకుంటున్నాను. నీవు ఎప్పుడు వస్తావో అని నిత్యం తలుచుకుంటాను. వేసవి సెలవులకు వస్తావనుకునేసరికి ఉద్యోగంలో చేరినట్టు ఉత్తరం వచ్చింది. ఆ రోజు అమ్మా నేను మందిరానికి పోయి పూజ చేసి వచ్చాము. దేవుణ్ని రోజూ - మా బావని తీసుకురా అని ప్రార్థిస్తున్నాను. మన ఊరమ్మవారిని పూజిస్తున్నాను. మా బావ వస్తే సత్యనారాయణ వ్రతం చేయిస్తానని మొక్కుకున్నాను. ఇప్పుడు రోజూ మందిరానికి వెళ్లినప్పుడల్లా బావ తొరగా ఆరోగ్యం కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బావరాక కోసం ఎదురుచూస్తున్న రోజుల్లో దినమో సంవత్సరంగా గడిచింది. బావతో నా మనసులోని వన్నీ చెప్పుకుని బావ ఒడిలో పడి కరువు తీరా ఏడవాలని ఉంది. ఇప్పుడు కూడా దుఃఖం ఉప్పొంగుతోంది. గుండెలోని దుఃఖాన్నంతా కడిగేసుకున్నట్టు ఏడవాలి. బావ పాదాలని నా చేతుల్లోకి తీసుకుని నా కన్నీళ్లతో కడిగేయాలి.

కాని బావ పొడి పొడి మాటలు. నాలిక చివరి నుంచి వచ్చే మాటలు....

నేనేం తప్పు చేశాను బావా? నా తప్పు మన్నించలేవా? తెలిసి చేసిన తప్పుకాదు బావా? నీ మాట వినలేదు సరే. కాని.... నా కష్టాలు.... ఈ దుఃఖంతో నేనేమైపోతానో....

బావా, నా కన్నీళ్లు తుడిచేవాడివి నీ ఒక్కడివే. అంతే నాకు తెలుసు.

ఎవరితో చెప్పుకోను బావా? ఎవ్వరికి అర్థమౌతాయి నా కన్నీళ్లు?

ఎవరు నా కష్టాలను అర్థం చేసుకుంటారు?

ఎవరి జీవితాలు వాళ్లవి. ఎవరి కష్టసుఖాలు వాళ్లవి.

అయినా వాళ్లు ఎవరు? వాళ్లతో ఎందుకు చెప్పుకోవాలి?

బావా, నీ మునివేళ్లతో నా కన్నీళ్లు తుడవవా? ఇష్టంగా కళ్లల్లోకి చూసి నీ చేతుల్లోకి నన్ను తీసుకోవా?

నా మనసు నీకు తెలుసు. నా కన్నీళ్లు నీకు తెలుసు. నా స్వప్నాలు నీకు తెలుసు. నా పూజలు నీకు తెలుసు. అయినా మనసు గట్టి చేసుకుని గుట్టుగా ఉంటున్నావు సర్లే. నీ ఇష్టం. నీ దగ్గర నేను ఓడిపోయాను.

రాజేశ్వర రావు:

ఈ సారి నేను రావడం అత్తమ్మని కష్టపెట్టడానికే అయింది. ఇంటి పనులు అన్నీ అత్తమ్మే చూసుకోవాలి. కంబార్లు ఉన్నా చెప్పి చేయించుకోవాల్సిన మావయ్య తాగుడుకు బానిసై, రోగిష్టిఐ ఇంట్లో ఒక సమస్య అయినాడు. మందులు తినడు. తాగుడూ మానడు. మూడేళ్ల క్రితం మావయ్య రాజన్న ఊళ్లో గౌరవ మర్యాదలతో బ్రతికాడు. పంటలు వల్ల వచ్చే ఆదాయం పొదుపు చేసుకునేవాడు. తల్లిదండ్రులు ఇచ్చినదానికి రెండెకరాల పొలం కలుపుకున్నాడు. ఊళ్లో పెద్దమనిషి అనిపించుకున్నాడు రాజన్న. తోటివాళ్ల అవసరాలకి సహాయపడేవాడు. మరి ఏ జాడ్యం పీడించిందో ఇప్పుడు చితికిపోయాడు. కొడుకు చిన్నకులం పిల్లని లేవతీసుకుని పారిపోయిన తర్వాత దుఃఖానికి తట్టుకోలేకపోయాడని, దాంతోనే ఈ తాగుడు అలవాటయిందని అత్తనే చెప్పింది. కొడుకు చేసింది ఊళ్లో నలుగురు ముందు తలవంచుకునే అవమానానికి గురిచేసింది. కూతురు కాపురం చెడిపోవటానికిక్కూడా ఇదే కారణం.

మావయ్యని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావాలి. అది కష్టం కాదు. ఒక ప్రయత్నం చేసి చూద్దామనుకున్నాను. నాతోపాటు విశాఖపట్నం తీసుకుపోతాను. నాతో పాటు కొన్నాళ్లు ఉంటే చాలా మెరుగవుతుంది మావయ్య ఆరోగ్యం. నాకు ఇప్పుడు తోచిన పరిష్కారం అదొక్కటే. నాతో వస్తాడు. నాతో ఓ నెలదినాలు ఉంటాడు. విశాఖపట్నంలో మా ఇంటి యజమాని గొప్ప జ్యోతిశ్శాస్త్ర వేత్త. మహాత్ముడు. వారి దగ్గరకు తీసుకుని వెళ్లి వారి ఆశీస్సులు తీసుకోవాలి. అట్లాగే సింహాచలం క్షేత్రం దర్శనం చేసుకోవాలి. మావయ్య తప్పక మారుతాడు. నాకా ధైర్యం ఉంది.

కాంతమ్మ ప్రవర్తన నాకు అర్థం కావటం లేదు. పెళ్లిళ్లు కొందరు చేజేతులా పాడుచేసుకుంటారు. అతి గారాబంతో పెరిగిందో ఏమో అత్తవారి ఇంట్లో సైతం ఆ పెడసరం చూపించిందో ఏమో. అత్తమామలతో సైతం అణుకువతో మెలగలేదోఏమో. నెమ్మదిగా ఆ సమస్య పరిష్కారం అవుతుందని నాకు అన్పిస్తున్నది. చూడాలి. మరి కొన్నాళ్లు ఓపిక పట్టాలి. కాంతమ్మ తెలుసుకోవాలి. తప్పు ఏమిటో ఆమె తెలుసుకున్నప్పుడు

అత్తవారి ఇంట్లో ఆమె స్థానం భద్రమవుతుంది. కాని కాంతమ్మ చెప్తే వినే మనిషికాదు.

నా బాధంతా అత్తమ్మ గురించే... భర్త బెంగ... కూతురు బెంగ.... కొడుకు గురించి ఆమె బెంగపడలేదు. వాడు తన సంతోషం కోసమే బైటికి వెళ్లాడు. వాడు సంతోషంగా ఉన్నాడని కబుర్లు తెలుస్తున్నాయి. భగవంతుని దయ. వాళ్లు సంతోషంగా ఉంటే అదే పదివేలు..... అంటుంది అత్తమ్మ. ఎప్పుడో అమ్మ మతిబడి తిరిగి వస్తాడు.

'మా రాజు' అని అత్తమ్మ నాగురించి ఇరుగు పొరుగు వాళ్ల తో మాట్లాడుతూ ఉంటే ఆమె ముఖంలో - నాకు రమణ మహర్షి ముఖం గుర్తొస్తొంది. అత్తమ్మ ముఖంలో ఆ దివ్యతేజస్సు. ఆ స్నిగ్ధ సౌందర్యం.... ఆ ముఖంలో మా తాతయ్య పోలికలు.

నా శ్రేయస్సు తప్పించి, నా సంతోషం తప్పించి, నా నించి ఆమె ఆశించింది ఏమీ లేదు. నాకు తెలుసు. మళ్లీ త్వరలోనే ఆ ఇల్లు పాతకళ తో కళకళ లాడుతుంది.

కథకుడు:

రాజేశ్వరరావు ఆరోగ్య మెరుగయింది. ఇంక తిరుగు ప్రయాణం రేపే. అయితే ఆ రాత్రి మావయ్య రక్తం కక్కుకున్నాడు. కెళ్లలు కెళ్లలు. కార్జ్యం ముక్కల్లాంటి రక్తం. వచ్చి చూసిన వాళ్లంతా, అప్పుడప్పుడు మందులిచ్చిన పెద్ద తాతతో సహా అంతా పెదవి విరిచారు.

అదే రాత్రి చివరి శ్వాస విడిచాడు.

రెండు చేతుల్తో గుండె కొట్టుకుని భర్తపాదాల మీద పడి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయింది ముత్యాలమ్మ. ఆ రాత్రి ఆ ఇల్లు జనంతో నిండిపోయింది. కాంతమ్మ భోరున ఏడవసాగింది. తల్లిని పట్టుకుని ఏడ్చింది కాంతమ్మ. మావయ్య మట్టిలో కలిసిపోయాడు. అంత్యక్రియలు రాజేశ్వరరావే చేశాడు. రాజేశ్వరరావు మరోసారి డాక్టర్ సర్టిఫికేట్‌తో సెలవు దరఖాస్తు ఆఫీసుకు పంపుకున్నాడు. తనకు ఏ సెలవులు లేవు. ఆఫీసరు మంచివాడు. తను వెళ్లిన తర్వాత స్వయాన తన మేనత్త భర్త, మావయ్య చనిపోయిన యదార్థం చెప్పుకోవాలనుకున్నాడు.

అయితే ఈ పన్నెండు రోజుల్లో కాంతమ్మ బావ ఒడిలో ముఖం పెట్టుకుని ఏడ్చింది. ఇప్పుడు తన కష్టం చెప్పుకున్న ఏడుపుకాదు. నాన్న చనిపోయిన బాధ. నాన్న కండ్లకి కనిపించని బాధ. అమ్మ ముఖం చూసి తట్టుకోలేని బాధ.

కాంతమ్మ అత్తవారు నలుగురయిదుగురు, ఇతర బంధువులూ వస్తున్నారు. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఓదార్చి వెళ్తున్నారు. మేనల్లుడు రాజేశ్వరరావుని పరామర్శించి వెన్ను తట్టి వెళ్తున్నారు.

అంతా నిద్రపోతున్నారు. అర్థరాత్రి. ఊరు నిశ్శబ్దం. చీకటి రాత్రి.

కాంతమ్మకి దుఃఖం ఉప్పెనలా ఉప్పొంగింది. తన మంచం మీదనే కూర్చుని ఏడవసాగింది. తల్లి ప్రక్కనే ఉంది. తల్లికి గత ఆరేడు రోజులుగా నిద్రలేదు. తల్లికి నిద్రాభంగం కలుగరాదని కుమిలి కుమిలి ఏడుస్తున్నది. రాజేశ్వరరావుకి తెలిసింది. లేచి ఆమె దగ్గరకు వెళ్లాడు.

'కాంతమ్మ.... కాంతమ్మ.....' అని ఆమెని తన చేతుల్లోకి తీసుకున్నాడు. 'నీవు ఇలా ఏడిస్తే మీ అమ్మ ఏమయిపోతుందో.... తెలుసుకో. ఏడవకు. ఏడవకు.' అని కాంతమ్మని తన గుండెల్లోకి తీసుకుని కావలించుకున్నాడు. ఆమె అతడిని చుట్టేసింది. కన్నీళ్లు కురుస్తూనే ఉన్నాయి.

'నేనున్నాను కదా'

*

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 19-11-1958